



రచ్చబండ వద్ద రైతులతో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

భూ సేకరణ పేరుతో రైతులకు అన్యాయం

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - గుత్తి

సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని వారిని అన్యాయం చేస్తున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. సోలార్ ప్రాజెక్టు కోసం రెన్యూ కంపెనీ భూసేకరణ చేస్తున్న అనంతపురం జిల్లా గుత్తి పరిధిలోని బేతాపల్లి, ధర్మాపురం, బాచుపల్లి, కరిడికొండ, ఊటకల్లు గ్రామాల్లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు. తమకు తెలియకుండానే సోలార్ ప్రాజెక్టుకు ఇచ్చేశామని అందువల్ల తాము పూర్తిగా నష్టపోతున్నామని ప్రస్తుతం తెలుస్తోందని కొంతమంది రైతులు వాపోతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కొంతమందిని బలవంతంగా భూములు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు చెబుతున్నారన్నారు. సోలార్ యజమానులు కూడా ముందుగా భూమి చుట్టుప్రక్కల కొనుగోలు చేసి మధ్యలో ఉన్న రైతులను బెదిరించి బలవంతంగా భూసేకరణ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిజంగా రైతులు ఇష్టపడి ఇచ్చినట్టయితే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా భూములు మీద ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు చేతి వృత్తిదారులకు 19 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు 5 రూపాయలు చొప్పున లేదా సంవత్సరానికి 60వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని వలసలు నివారించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం పైన జిల్లా కలెక్టర్ తోపాటు రెవెన్యూ అధికారులు భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షుడు రామాకృష్ణ, సహాయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకుడు సి.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగన్న, నాగలింగయ్య, గుత్తి మండల అధ్యక్షులు చంద్ర, వస్నూరమ్మ, రామేశ్వర, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన రెవెన్యూ క్రీడా సంబరం



బ్యాంటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి



రెవెన్యూ క్రీడా పోటీల సందర్భంగా వందేమాతరం గీతాలాపనలో సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, తదితరులు



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దుర్యోధనుడి వేషధారణలో అనంతపురం డిఆర్ఓ మలోలా

ప్రజాశక్తి -అనంతపురం

ఎపి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా సంబరాలు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. అనంతపురం నగరంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో మూడు రోజులపాటు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు జరుగుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం క్రీడలను ప్రారంభించేందుకు సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రీడా పతావిష్కరణ అనంతరం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతర గీతాలాపన జరిగింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రెవెన్యూ క్రీడాకారుల బృందాలు మార్చుఫాస్టు నిర్వహించాయి. మార్చుఫాస్టు బాగా చేసిన జిల్లాల్లో కాకినాడ మొదటి స్థానంలో నిలువగా, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి మూడవ స్థానం, నంద్యాల నాలుగో స్థానంలో నిలిచింది. ఈ బృందాలను సిసిఎల్ఏ చీఫ్ కమిషన్ జి.జయలక్ష్మి సత్కరించారు. అనంతరం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మైదానంలో దిగి జయలక్ష్మి క్రికెట్ బ్యాట్ పట్టి బ్యాటింగు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలల నుంచి రెవెన్యూ ఉద్యోగులు ఇక్కడికి విచ్చేసి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆటల్లో లాగానే పనిలోనూ ఉద్యోగులు అదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. మంచి వాతావరణంలో ఎక్కువ సేవలు అందించడానికి క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇక్కడ ఇంతటి చక్కటి ఏర్పాట్లు చేసిన జిల్లా రెవెన్యూ ఉద్యోగులను ఆమె అభినందించారు. జిల్లా కలెక్టరు ఆనంద్ మాట్లాడుతూ మొట్టమొదటిసారి రెవెన్యూ ఉద్యోగుల సంఘం క్రీడలు అనంతపురం జిల్లాలో జరగడం ఆనందకరమన్నారు. ఈ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు నిరంతరం ఒత్తిడిలో పనిచేస్తుంటారన్నారు. అట్టి వారికి ఇటువంటి క్రీడలు ఉత్సహాన్ని నింపడంతోపాటు టీమ్ స్పిరిట్‌తో పనిచేయడం నేర్పుతాయని పేర్కొన్నారు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరుసార్లు రాష్ట్ర స్థాయి క్రీడలు జరిగాయని చెప్పారు. ఇప్పుడు అనంతపురంలో జరుగుతున్నది ఏడవ రాష్ట్ర క్రీడోత్సవాలని చెప్పారు. నిత్యం పని ఒత్తిడిలో సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగులకు ఇవి ఆటవిడుపుగా ఉంటూ ఉత్సహాన్ని నింపుతాయని చెప్పారు. అనంతరం అవుట్‌డోర్, ఇండోర్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయా పోల్స్ వారీగా పోటీలు జరిగాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టరు ఆనంద్, సత్యసాయి జిల్లా కలెక్టరు శ్యాం ప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ నారాయణ శర్మ, మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డిఆర్ఓ మలోల, సత్యసాయి జిల్లా డిఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఎపి రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేశ్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేట్ ప్రెసిడెంట్ త్రినాథరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల వివరాలు....

శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆర్ డి టి స్టేడియంలో 7 ఏపీ రెవెన్యూ రాష్ట్రస్థాయి క్రీడా, కల్చరల్ మీట్ జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, బాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్‌టెన్నిస్ తదితర విభాగాల్లో పురుషులు, మహిళల విభాగంలో పోటీలు ఆసక్తికరంగా సాగాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల నిర్వహణ లో భాగంగా ఆటపాట కార్యక్రమాలు జరిగాయి. సింగింగ్, డాన్స్, దాండియా, డ్రామా, టాక్ షో, నాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లా నుండి పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు వారి యొక్క కళా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి రంజింప చేశారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారి మలోలా చేసిన పాన్సు శీను, సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, అనంతపురం జిల్లా ఆర్డీవో కేశవ నాయుడు ఎపిఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఎస్‌డిసిలు మల్లికార్జున , రామ్మోహన్ ఆనంద్, తిప్పే నాయక్, మల్లికార్జున రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, కార్యదర్శి సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కార్యదర్శి హరి ప్రసాద్ రెడ్డి, సత్యసాయి జిల్లా ఏపీ ఆర్ఎస్ఏ అధ్యక్షులు మధు నాయక్, కార్యదర్శి మైనుద్దీన్, మీడియా ఇన్చార్జి మునివేల్, డి ఎస్ డి ఓ మంజుల, అన్ని జిల్లాల రెవెన్యూ ఉద్యోగులు ఉమ్మడి జిల్లాల ఆర్డీవోలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులు మార్చిఫాస్ట్



రాయదుర్గంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి అసెంబ్లీని ముట్టడిస్తాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - రాయదుర్గం

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఈనెల మూడో తేదీన చేపట్టిన అనంతపురం జిల్లా జీపుయాత్ర ఐదో రోజు ముగింపు కార్యక్రమం శుక్రవారం రాయదుర్గం పట్టణంలో జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి వినాయక కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి అధ్యక్షతన జరిగిన జరిగిన బహిరంగ సభలో రామ్మోహన్, అనంతపురం జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులపాటు ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర నిర్వహించామని అందులో విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలు విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. గురువారం తాము కళ్యాణదుర్గంలో జీపు యాత్రలో భాగంగా పర్యటిస్తే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కళ్యాణదుర్గం రానున్న సందర్భంగా తాము మంత్రిని ఎక్కడ అడ్డుకుంటామో అని తమను అక్కడి నుండి వెళ్లిపోవాలని పోలీసు అధికారులు ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు సంక్షేమ వసతిగృహాలు విష సర్పాలకు నిలయాలుగా మారాయన్నారు. పలుచోట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కనీసం కళాశాలలో మధ్యాహ్న భోజనం తినేందుకు భోజనశాలలకు దిక్కులేని పరిస్థితి ఉందని అన్నారు. అలాగే కేజీబీవీ పాఠశాలలకు ఆట స్థలాలు లేవని, రెగ్యులర్ అధ్యాపకులు లేని దుస్థితి నెలకొందని చెప్పారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో విద్యారంగంలో అనేక సమస్యలు ఉంటే కనీసం పట్టించుకునే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదన్నారు. 6800 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉంటే ఎస్ఎఫ్ఐ నిర్వహించిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం సందర్భంగా తుతూ మంత్రంగా 400 కోట్ల రూపాయలు మాత్రం విడుదల చేశారన్నారు. అలాగే ఓవైపు మెడికల్ కళాశాలలో త్రిబుల్ పి విధానాన్ని తీసుకొచ్చి మెడికల్ విద్యను అస్తవ్యస్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మంత్రి నారాయణ కోసం ఇంటర్ కళాశాలల సమయాన్ని మార్చివేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థునులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాయదుర్గం పట్టణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గుమ్మగట్ట, కనేకల్లు ప్రాంతాలకు గురుకుల పాఠశాలలో భవనాలు ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ఒక డాక్యుమెంట్ రూపంలో జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు శివ, భీమేష్, అరుణ్, రషీద్, వంశి, శాంతిరాజ్ జిల్లా నాయకులు విజయ్, ఓము, శశివర్మ, తదితరులు పాల్గొన్నారు

రహదారులపై గుంతలను పూడ్చండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

పట్టణంలోని ప్రధాన రహదారులైన మహాత్మాగాంధీ, గుత్తి, కసాపురం, తదితర రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు ఈమేరకు శుక్రవారం పట్టణంలోని రహదారిపై ఏర్పడిన గుంతల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ జియో సంస్థ కేబుల్ వైర్లు వేయడానికి రహదారులను తవ్వి వాటికి మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో రహదారుల మధ్య గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్ వెంటనే స్పందించి రహదారుల్లోని గుంతలు మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ కుమార్, షాషా, చెర్రీ, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



నారాలోకేష్‌కు పుష్పగుచ్ఛ ం అందజేస్తున్న ఆర్థికశాఖ మంత్రి

రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ లు బి కే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, అమ్మినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సత్య సాయి జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు ఆంజనేయులు, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ , బిజెపి జిల్లా అధ్యక్షులు, జిఎం శేఖర్, నియోజకవర్గ ఎమ్మెల్యే ,నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఇక్కడికి వచ్చారు. శనివారం కళ్యాణదుర్గంలో కనకదాస విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం ఉమ్మడి జిల్లాల పర్యటనకు శుక్రవారం సాయంత్రం 4:15 నిమిషాలకు పుట్టపర్తి విమానశ్రయానికి చేరుకున్నారు. సత్య సాయి బాబా చిత్రపటాన్ని నారా లోకేష్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా బహుకరించారు. ఈ నవంబర్ మాసంలో పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతోత్సవాలకు ముఖ్య అతిథిగా పుట్టపర్తికి రావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంత్రి నారా లోకేష్ ను ఆహ్వానించారు.

నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్ : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కలిశారు . కళ్యాణదుర్గం పర్యటనలో భాగంగా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ని కందికుంట కలిశారు. అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్యే కందికుంట కళ్యాణదుర్గం పర్యటనకు వెళ్లారు.

ఆర్థనాధాలు.. ఆపన్న హస్తాలు..

లింగంపల్లి ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పిందంటూ హెచ్చరిక..

ఎన్‌డిఆర్ఎఫ్ ఆర్‌పిఎఫ్, బృందాల సహాయక చర్యలు

ఉత్కంఠ రేపిన మెగా మాక్ డ్రిల్

ప్రజాశక్తి గుంతకల్లు

రైల్వే ప్రధాన జంక్షన్ సమీపంలోని తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్ డంపింగ్ యార్డ్ వద్ద తిరుపతి-లింగంపల్లి ప్యాసింజర్ రైలు శుక్రవారం పట్టాలు తప్పి ప్రమాదానికి గురై ఒక భోగిపై మరో భోగి ఎక్కగా భోగిల్లోని ప్రయాణికులు ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రమాద సైరా లింగంపల్లి తిరుపతి ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పిందంటూ మైకులో ప్రకటనలు చేశారు. వెంటనే రైల్వే అధికారులు యాక్సిడెంట్ రిలీఫ్తో వ్యానుతో పాటు 108 అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్‌పిఎఫ్‌జిఆర్‌పి సివిల్ పోలీసులు, ఆపరేటింగ్ సేఫ్టీ ఇంజనీరింగ్ కమర్షియల్ మెడికల్ అన్ని విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది గురుకుల పరుగులతో ఘటన స్థలానికి చేరుకున్నారు. అదేవిధంగా బెంగళూరుకి చెందిన జాతీయ విపత్తు ప్రతిస్పందన బెటాలియన్ అధికారులు, జనరేటర్లు మెడిసిన్ స్ట్రక్చర్లు, భోగిలను కట్ చేసే యంత్రాలతో వంటి వివిధ రకాల వస్తువులతో చేరుకున్నారు. భోగిల్లో గాయపడిన ప్రయాణికులను రక్షించేందుకు కిటికీలను యంత్రాలతో కట్ చేసి గాయాలపాలైన ప్రయాణికులను స్ట్రక్చర్లతో బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇంతలోనే భోగిలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇలా సుమారుగా మూడు గంటల పాటు శ్రమించి ప్రయాణికులను రక్షించారు. ఇంతలోనే బిఆర్ఎం చంద్రశేఖర్ గుప్త అక్కడికి వచ్చి 'ఇది మాక్ డ్రిల్'గా ప్రకటించారు. రైల్వే, జాతీయ విపత్తు ప్రతిస్పందన (ఎన్‌డిఆర్ఎఫ్) బెంగళూరు బెటాలియన్ టీం సంయుక్తంగా డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్త పర్యవేక్షణలో నిర్వహించిన మెగా మాక్‌డ్రిల్ రైలు ప్రమాద ఘటనను కళ్లకు కట్టినట్లుగా తలపించింది. లింగంపల్లి – తిరుపతి ప్యాసింజర్ రైలు శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో గుంతకల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని తిమ్మనచర్ల రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదానికి గురైనట్లుగా కల్పితం చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్త, ఎన్‌డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ అఖిలేష్‌కుమార్ చౌబే, జోనల్ హెచ్ఎం శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాదం సంభవించినప్పుడు ఎన్‌డిఆర్ఎఫ్, రైల్వే అన్ని శాఖల రక్షణ అధికారులు సిబ్బంది అప్రమత్తమై ప్రయాణికులను కాపాడాలో సహాయక చర్యలు ఎలా చేపట్టాలో ఏడాదికోరు మాక్‌డ్రిల్ నిర్వహిస్తామన్నారు. మాక్‌డ్రిల్ నిర్వహణలో సిబ్బంది పనితీరు సహాయ, సూచనలు ఏ విధంగా చేపట్టాలో క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఇఎన్ కోఆర్డినేషన్ డివిఎన్ శ్రీనివాస్, సీనియర్ డిసిఎం మనోజ్, డిసిఎం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



బోగీల్లోని మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



రైలులో నుంచి ప్యాసింజర్లను బయటకు తీస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

మంత్రి లోకేష్‌కు నిరసన సెగ



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఇటీ, విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌కు నిరసన సెగ తగిలింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా, కనీసం వాహనం కూడా దిగకుండా వెళ్లిపోయారని దళితులు మండిపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కనకదాసు విగ్రహావిష్కరణ కోసం మంత్రి నారాలోకేష్ పర్యటన ముందే ఖరారయ్యింది. ఇందులోభాగంగానే 7వ తేదీ సాయంత్రం ర్యాలీచేసి ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించడం, కష్టపడిన కార్యకర్తలకు సన్మానం లాంటి కార్యాచరణను రూపొందించారు. 8వతేదీన కనకదాసు జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు విగ్రహావిష్కరణ, బహిరంగ సభకు ఏర్పాటు చేశారు. అయితే నారాలోకేష్ పర్యటన ఆలస్యం కావడంతో రాత్రి సుమారు 8 గంటల సమయానికి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకున్నారు అక్కడున్నవారిని పలకరించి ముందుకు సాగుతూ అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. సాయంత్రం నుంచి లోకేష్ రాకకోసం పలు దళిత సంఘాల నాయకులు వేసిచూశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా, కనీసం వాహనం కూడా దిగకుండా ముందుకెళ్లిపోవడంతో దళితులు ఆగ్రహించారు. అంబేద్కర్‌ను మంత్రి లోకేష్ అవమానించారంటూ మండిపడ్డారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులంటే ఇంత చులకనా అంటూ ప్రశ్నించారు. కొవ్వొత్తులు వెలిగించి మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరికి దళితులే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. టీసర్కిల్, గాంధీచౌక్, వాల్మీకి సర్కిల్‌లో లోకేష్‌ను కలవడానికి వచ్చిన కొన్ని వర్గాల ప్రజలు కూడా అవకాశం లభించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. రాత్రి పొద్దుపోయాక మంత్రి లోకేష్ ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఎంపీ అంబికలక్ష్మినారాయణ, ఎమ్మెల్యే సురేంద్రబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు.

ప్రజాదర్బార్‌లో 56 దరఖాస్తులు స్వీకరణ



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి 56 దరఖాస్తులు అందాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వ్యక్తిగత, సామూహిక అవసరాల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ డి.హీరేహాళ్ మండలం మలపనగుడి గ్రామంలో రైతులకు సంబంధించిన భూములు అటవీశాఖ ఆధీనంలో ఉన్నట్లు రికార్డులకు ఎక్కించడంతో అందువల్ల ఆయా రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో భూములు జాయింట్ ఎల్‌పి ఉండటం వల్ల రైతులకు అన్నదాత సుఖీభవ, మొదలైన సంక్షేమ ప్రయోజనాలు అందడం లేదన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల వారీగా అధికారులకు పంపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, టిడిపి నాయకులు కృష్ణమూర్తి, మోహన్‌రెడ్డి, నాగరాజు, మహబూబ్‌బాషా, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జయరాములు ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలుగా వాయిదా పడుతూ వస్తున్న సర్వసభ్య సమావేశం ఎట్టకేలకూ కొన్నిశాఖల అధికారులతో నిర్వహించారు. అయితే నారా లోకేష్ కళ్యాణదుర్గం పర్యటన ఉండటంతో అక్కడికి కొందరు అధికారులు వెళ్లినట్లు ఎంపిడిఒ జయరాములు తెలిపారు. ముందుగా ఉపాధి పనులపై ఎపిఒ వివరించారు. జాబ్‌కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని కోరారు. ఇందుకు భూపసముద్రం సర్పంచు స్పందిస్తూ గ్రామంలో ఎవరికీ తెలియకుండా ఈకెవైసి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో సర్పంచులు, ఎంపిటిసిలను మమేకం చేయడం లేదని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ హనుమంతప్ప, ఎంఇఒ సోమశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రణీత, హనిమల్ హస్బండ్రీ డాక్టర్ నవీన్, పబ్లిక్ హెల్త్ సెంటర్ డాక్టర్ సందేష్, ఎంఇఒ సోమశేఖర్, హౌసింగ్ ఎఇ రాము, ఉపాధి హామీ ఎపిఒ సురేష్, ఎంపిపి భవాని, తదితరులు పాల్గొన్నారు.

బీళ్లను సాగు భూములుగా మార్చాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయలసీమలో బీడు భూములను సాగు భూములుగా మార్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయదుర్గంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు బీడు భూములుగా ఉన్న 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. గత 15 ఏళ్ల నుంచి హంద్రీనీవా కాలవ ఉన్నప్పటికీ 40 టీఎంసీల నీరు వచ్చే పరిస్థితి ఏరోజూ లేదన్నారు. కాలువ వెడల్పు చేసి నీటిని పుష్కలంగా వినియోగించుకునే పరిస్థితి ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన నారాలోకేష్ నీటిని మళ్లించే ప్రయత్నాలు, కాలువలు వెడల్పు చేసే ఆలోచనలపై దృష్టి సారించాలని కోరారు. అంతేగాకుండా ఈప్రాంత వాసులకు స్పష్టమైన హామీలు ఇచ్చి నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, కార్యవర్గ సభ్యులు నాగార్జున, రాజేష్, నాయకులు హనుమంతురాయుడు, కొట్రెష్, ఎపి రైతుసంఘం రాయదుర్గం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వంద రోజులు 'ఉపాధి' కల్పించాలి

ఎపిడి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎపిడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-బెలుగుప్ప

పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రతి కుటుంబానికీ తప్పనిసరిగా వందరోజులు ఉపాధి పనులు కల్పించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకీ ఈకెవైసి తప్పనిసరిగా చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈకెవైసితోపాటు లేబర్ బడ్జెట్ 2026-27 వరకు పనుల గుర్తింపు, మొక్కలు నాటడం, వంద రోజుల పనులు, తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎపిఒ మురళీకృష్ణ, ఈసీ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు నాగేంద్ర, అవినాష్, ఈశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి నమోదు కార్యక్రమం

అనంతపురం : అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం పాలిత)లో 2025-26 విద్యా సంవత్సరానికి శుక్రవారం ఎన్‌సిపి నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దసంఖ్యలో విద్యార్థినులు తమపేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ ఎల్ డి రోడ్రిగ్స్, ఎన్‌సిపి లెఫ్టినెంట్ జి.చిన్న వెంకటమ్మ, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు.. వేధింపులు ఆపాలి

సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల కార్మికుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అక్రమ తొలగింపులు.. వేధింపులను వెంటనే ఆపాలని నగరంలోని సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల కార్మికులు, సూపర్వైజర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు పెద్దాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ, మెడికల్ కళాశాల, నర్సరీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఎమ్మెల్యే దగుపాటి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ వద్దకు చేరుకుని సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, మూర్తుజా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ నూతన ఏజెన్సీగా రాయలసీమ 8 జిల్లాల టెండర్ తెచ్చుకున్న పద్మ ఏజెన్సీ భాస్కర్‌నాయుడు నిబంధనల పేరుతో ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డెయిలీ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ జీవోల ప్రకారంగా 60ఏళ్లపాటు విధులు కొనసాగించాలని ఉండగా, 50ఏళ్లకే విధుల్లోంచి తొలగిస్తున్నారన్నారు. దాదాపు 15, 20ఏళ్లుగా కొనసాగుతున్న కార్మికులు, సూపర్‌వైజర్లను ఉన్నట్టుండి తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇదేమని అడిగితే లేని డిగ్రీలు సర్టిఫికెట్లను అడుగుతున్నాడన్నారు. అంతేగాకుండా నూతనంగా నియమించుకునే కార్మికులు, సూపర్‌వైజర్ల పోస్టులకు రూ.2 నుంచి రూ.3లక్షల వరకూ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాల ఉంటుందన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా సహించే ప్రసక్తి లేదన్నారు. తక్షణమే పద్మ ఏజెన్సీ నిర్వాహకుడితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పట్టణ అధ్యక్షురాలు నల్లమ్మ, సిఐటియు నాయకత్వం ఎన్టీఆర్ సీనా, ఆజం, సాకే తిరుమలేష్, బంగ్లా రాఘవేంద్రప్రసాద్, బండారి స్వామి, సూపర్‌వైజర్ నాయకత్వం శివ, హరి, రామాంజి, రఘు, ప్రమీల, యల్లమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై నిర్లక్ష్యం తగదు

పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి-సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల వినతి



ఎంపిడిఒ కార్యాలయ పాలన అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఎనిమిది గంటలు ఉన్న పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ కార్మికుల హక్కులను కాలరాయాలని చూడటం తగదని సిఐటియు నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గన్నవారిపల్లి పంచాయతీ కార్మికులతో కలిసి కార్యాలయ పరిపాలన అధికారి రాజేంద్రప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ జీవీపీ కాలనీలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇప్పటికీ ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, భద్రత పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఎనిమితి గంటల పని విధానాన్ని రద్దు చేసి 10 గంటల విధానాన్ని అమలు చేసేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు మద్దతు ఇచ్చేలా వ్యవహరించడం మంచిది కాదన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, హనుమంతురెడ్డి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, రమాదేవి, సంధ్యాభాయ్, రామాంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.



బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు, ఐద్వా నాయకురాళ్లు

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని పంతులకాలనీ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ మానసిక వైద్య నిపుణులు లహరి విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు 6వ తరగతి నుంచి 10వ తరగతి తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్నారు. మీ పట్ల తప్పుగా ప్రవర్తించే నాన్నయినా, అన్న అయినా, తమ్ముడైన, బాబాయి అయినా, స్నేహితుడైనా వెంటనే తల్లికి చెప్పాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ ఆడపిల్లలు ప్రస్తుత కాలంలో ఎక్కువగా అవసరానికి మించి సెల్‌ఫోన్‌లు వాడుతున్నారన్నారు. వాడకూడదన్నారు. ప్రతి ఒక్క పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. వీలైతే ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, నగర కోశాధికారి గీత, శైలజ, 200 మంది పిల్లలు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథంతో అడుగులు

ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు నిరంజన్‌రెడ్డి, ఫణిమహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలను చైతన్యవంతంగా చేసే ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నిరంజన్‌నరెడ్డి, ఫణిమహేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని ఐఎంఎ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ స్థాయి ప్రజలకు మెరుగైన వైద్యఫలాలను అందించే క్రమంలో జిల్లా ఐఎంఎ సభ్యులు సమిష్టి కృషితో ముందుకెళ్తారన్నారు. ఐఎంఎ కుటుంబం తమతో కలిసి సేవా కార్యక్రమాల్లో ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆసుపత్రి అధినేత డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎన్‌ఆర్ ఫర్టిలైజర్‌కు మరోమారు షోకాజ్ నోటీసు జారీకి ఆదేశాలు

అనంతపురం : గతనెల సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలానికి చెందిన ఓ రైతు కొన్న వ్యవసాయ ఉత్పత్తులకు ఎన్‌ఆర్ ఫర్టిలైజర్ దుకాణదారులు బిల్లు ఇవ్వలేదన్న ఫిర్యాదుపై మరోమారు షోకాజ్ నోటీసు ఇచ్చేందుకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో వ్యవసాయ శాఖ నిబంధనలు పాటించలేదన్న లేదన్న కారణంతో దుకాణం తనిఖీకి వెళ్లిన ఎడిఎ జిఎం అల్తాఫ్‌అలీఖాన్, మండల వ్యవసాయ అధికారి వెంకటాకుమార్ కలిసి రూ.26లక్షలు అమ్మకాలు నిలుపుదల చేసి సోకాజ్ నోటీస్ జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసులకు సరైన వివరణ ఇవ్వలేదన్న కారణంతో సదరు దుకాణం వ్యవసాయ శాఖ లైసెన్స్ రద్దు చేసినట్లు ప్రకటన విడుదల చేశారు. అయితే ఎన్‌ఆర్ ఫర్టిలైజర్ దుకాణదారుడు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ చేసిన అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు తిరిగి తాజా షోకాజ్ నోటీసు, రైతు ఫిర్యాదు పంచనామా జత చేసి మళ్లీ సోకాజ్ నోటీసు జారీ చేసి సంజాయిషీ అందిన తర్వాత చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

నియోజకవర్గాల స్థాయిలో 'మాక్ అసెంబ్లీ'

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో స్పీకర్ ఎన్నిక, సభ్యుల ప్రమాణ స్వీకారం, జీరో అవర్, ప్రశ్నోత్తరాలు, తీర్మానాల ఆమోదం వంటివి చేపట్టారు. స్పీకర్‌గా హాసిని, సభా నాయకురాలుగా బిందు, ప్రతిపక్ష నాయకులకు భవ్య, కుందన, నక్షత్ర వ్యవహరించారు. కాగా సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని బొమ్మన దీక్షిత శింగనమల నియోజకవర్గ ప్రతినిధిగా నవంబర్ 26న నిర్వహించనున్న అమరావతి మాక్ అసెంబ్లీలో పాల్గొననున్నట్లు ఎంఇఒ నరసింహారాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 శివప్రసాద్, నార్పల, బుక్కరాయసముద్రం ఎంఇఒలు నారపరెడ్డి, లింగానాయక్, ప్రధానోపాధ్యాయులు సిరాజుద్దీన్, ఉపాధ్యాయులు శివశంకరయ్య, రజనీకుమారి, బోరంపల్లి నాగరాజు, భయపరెడ్డి, గంగాభవాని, పరిమిలాదేవి, హేమలత, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి మాక్‌అసెంబ్లీ నిర్వహించారు. ఇందులో అసెంబ్లీ జరిగే విధానాన్ని విద్యార్థులు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శాంసన్, ఓబుళపతి, శివానంద, నాగరాజు, అరుణకుమారి, షానుజ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్ నివారణ సాధ్యం

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో డిఎంహెచ్‌ఒ దేవి



అనంతపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత సమాజంలో ప్రజలను పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి నివారణ కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని డిఎంహెచ్‌ఒ ఇబి దేవి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని డిఎంహెచ్‌ఒ ప్రారంభించారు. స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ క్యాన్సర్లు ప్రధానంగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం, నోటి క్యాన్సర్లు అత్యధికంగా వ్యాపిస్తాయన్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతాయన్నారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జయలక్ష్మి, డిఎంఒ ఓబులు, డెమో నాగరాజు, హెచ్‌ఇఒ త్యాగరాజు, పిఎంఒ నాగన్న, డిప్యూటీ హెచ్‌ఇఒ గంగాధర్, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు, ప్రేమ్, కిషోర్, మౌనిక, శశికళ, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేడియేషన్ ఆంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శంకర్, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ కెఎల్ సుబ్రమణ్యం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బెనడెక్ట ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్యపానం, ధూమపానం అలవాట్లు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సరళ, సుచిత్ర, ఆది నటేష్, మాధవీలత, బేబీ సాయిరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుష్మ, శ్రీనివాసరావు, నాగ ప్రవీణ్, గీతాంజలి, కుష్బూ, ఫర్హానా, నీరజ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు లలిత భవాని, సుమన గోపీచంద్, ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. జాతీయ కాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ స్వాతిలక్ష్మి, డాక్టర్ తహేరున్నీసా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మన్నేరు కొండమ్మ పరమేష్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, పిహెచ్‌ఎన్ నాగలక్ష్మమ్మ, నాయకులు బుల్లే నారాయణస్వామి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సత్యనారాయణశాస్త్రి, జానీ రాజ్, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, జ్యోతి, కీర్తి, యామిని, మణి, గౌతమి, జయంతి, ధనలక్ష్మి, మంజు భార్గవి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు నాగేంద్రమ్మ, ఆదిలక్ష్మి, నందిని, భారతి, అరుణదేవి, లక్ష్మీదేవి, అంజనమ్మ, వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు ప్రసన్న, శ్రీదేవి, సరస్వతి మంగళమ్మ, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం' సందర్భంగా శుక్రవారం మండలం పరిధిలోని సిద్ధరాచెర్ల గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాన్సర్ నివారణ, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకే రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి కుళ్లాయప్ప, ఎఎన్‌ఎం గౌతమి, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, ఆశా ఈశ్వరమ్మ, డిజిటల్ అసిస్టెంట్ అనిల్, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ గీతారెడ్డి..

జాతీయస్థాయి పోటీలో కణేకల్లు విద్యార్థిని ప్రతిభ



రష్యా శాస్త్రవేత్తతో సర్టిఫికెట్ అందుకుంటున్న గీతారెడ్డి

రాయదుర్గం : కణేకల్లు మండలం హనకనహాళ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గీతారెడ్డి 'అంతరిక్ష శాస్త్రం - ప్రపంచస్థాయి అధ్యయనం' అనే అంశంపై ఢిల్లీలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా రష్యన్ శాస్త్రవేత్త ప్రథమ బహుమతి, సర్టిఫికెట్ స్వీకరించింది. దీంతో విప్ కాలవ శ్రీనివాసులు గీతారెడ్డిని అభినందించారు. జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన గీతారెడ్డిని విప్ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. అంతేగాకుండా రాయదుర్గం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు.

'బేటీ బచావో బేటీ పడావో'

గుమ్మఘట్ట : మండల కేంద్రంలోని ఎంజెపి పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలకు పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి బాలిక విద్య, ప్రాముఖ్యత, అమ్మాయి ఎదిగిన తర్వాత ప్రవర్తించాల్సిన తీరు, బాల్యవివాహాలు, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంజెపి పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జానకిరామ్ సునంద, అంగన్వాడీ టీచర్లు మంజుల, చంద్రకళ, మేరీ, కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 బాలిక జట్టుకు ఎస్ఐ కూతురు

నార్పల : అండర్-19 బాలికల క్రికెట్ రాష్ట్ర జట్టుకు నార్పల మండల ఎస్ఐ సాగర్ కుమార్తె గీతిక ఎంపికైంది. క్రీడల్లో కుమార్తెను బాగా ప్రోత్సహించి రాష్ట్రస్థాయి జట్టు వరకూ తీసుకెళ్లిన ఎస్ఐ సాగర్‌కు పలువురు అధికారులు, సీనియర్ క్రీడాకారులు, స్థానిక పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన జెఎన్‌టియు విసి

అనంతపురం : జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జెఎన్‌టియుకు అనుబంధంగా శ్రీకాళహస్తి ఇంజినీరింగ్ కళాశాలను మార్పు చేసినందుకు, జెఎన్‌టియు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే జెఎన్‌టియులో పలు నూతన భవనాలు నిర్మాణం పూర్తయినందున వాటి ప్రారంభానికి రావాలని లోకేష్‌కే ఆహ్వానం అందించారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

పుట్లూరు : జిల్లా పర్యటనకు వచ్చిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రయంలో లోకేష్‌కు బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు.

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడికి సన్మానం

గుత్తి : ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా ఎన్నికైన అంజన ప్రసాద్ ను శుక్రవారం పలువురు సన్మానించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులుగా ఉన్న అంజనప్రసాద్‌ను రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ఎన్నుకున్నారు. దీంతో అంజన ప్రసాద్ నివాసానికి వెళ్లి పలువురు టిడిపి, వైసిపి, సిపిఎం, సిపిఐ, దళిత సంఘాల నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు.

బిందు సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోండి

బెలుగుప్ప : ప్రభుత్వం ద్వారా అందించే బిందు సేద్య పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు కోనంపల్లి, రామసాగరం, దుద్దేకుంట, జీడిపల్లి గ్రామాలను మైక్రో ఇరిగేషన్ పీడీ సందర్శించి ప్రభుత్వం అందించే రాయితీ, జీఎస్టీ వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎఒ మల్లేష్, సిబ్బంది మంజు, శ్రీనివాసులు, వేణుగోపాల్, రైతు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల పరిరక్షణకు కృషి

అనంతపురం : దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు రాజీలేని పోరాటాలు చేస్తున్నామని ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని పాతూరులో ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 20ఏళ్లుగా దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాట్లు తెలిపారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ హరినాథ్‌రెడ్డి దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న సేవలు అమోఘమన్నారు. అనంతరం హరినాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంత హాల్ మార్క్ సెంటర్ ప్రొప్రైటర్ గోపాల ఆచారి, మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మస్‌వలి ఉరుసు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన షర్మస్‌వలి దర్గా ఉరుసు మహోత్సవం శుక్రవారం దీపారాధనతో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గా ముతువల్లి బాషా మాట్లాడుతూ మొదటి దీపారాధనతో ఉరుసు ప్రారంభమైందన్నారు. శనివారం రెండో దీపారాధన, ఆదివారం మూడో దీపారాధన, ఆదివారం అర్ధరాత్రి గుర్రం సవారీ వర్ణాల్లి గ్రామం నుంచి ప్రారంభమవుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన సుబ్బరాయుడు

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామానికి చెందిన డేరంగుల సుబ్బరాయుడు (63) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుబ్బరాయుడు ఇంటి ముందు ఏపుగా పెరిగిన మేడిచెట్టు తీగలు కోస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

యల్లనూరు : మండల పరిధిలోని వెన్నపూసపల్లి రెవెన్యూ పరిధిలో తోటల్లో కేబుల్ వైర్లను చోరీ చేస్తున్న నిందితులను పట్టుకోవాలని జెడ్పీటీసీ బోగాతి విజయ్‌ప్రతాప్‌రెడ్డి, స్థానిక రైతులతో కలిసి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామాంజనేయరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతుల తోటల్లో ఇదివరకే చాలా చోరీలు జరిగాయన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎస్ఐ స్పందిస్తూ త్వరలోనే నిందితులను పట్టుకుని రైతులకు న్యాయం చేస్తామన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

యల్లనూరు : స్థానిక హిందుస్తాన్ పెట్రోల్ బంకుకు తృటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంలో పెట్రోల్ కోసం వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారులు పంపు వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ పంపును ఢీకొన్నాడు. దీంతో పంపు డీజిల్ గన్ దెబ్బతింది. అయితే ఆ సమయంలో గన్‌లో పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యల్లనూరు : మండల పరిధిలోని సింగవరం, గ్రామ సమీపంలోని దంతలపల్లి మలుపు వద్ద శుక్రవారం టాటా ఐసి-ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. తిమ్మంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, కుళ్లాయప్ప పులివెందుల నుంచి తిమ్మంపల్లికి వస్తుండగా దంతలపల్లి వద్దకు రాగానే అటు వైపు నుంచి అరటి పండ్ల లోడుతో వస్తున్న టాటా ఐసికి అదుపు తప్పి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసులురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న స్థానికులు హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.